క్లుప్తంగా

గ్రామసభలపై నిర్లక్ష్యం తగదు

మండవల్లి: గ్రామసభలను ప్రభుత్వ అధికారులు నిర్లక్ష్యంగా నిర్వహిస్తున్నారని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక జిల్లా కన్వీనర్ టి.అప్పారావు అన్నారు. ఈ మేరకు సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించిన మీకోసం కార్యక్రమంలో తహసీల్దార్ కె.గోపాల్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామసభలకు 20 రోజులు ముందుగా షెడ్యూలను తయారు చేసి ప్రణాళికలు సిద్ధం చేయాల్సి ఉండగా 1, 2 రోజులు ముందు మాత్రమే షెడ్యూలను తయారు చేస్తున్నారని విమర్శించారు. దీంతో గ్రామ సభలకు అధికారులు, ఓటర్లు కూడా హాజరు కావడం లేదని పేర్కొన్నారు.

కొండలమ్మ సన్నిధిలో కలశ స్థాపన



గుడ్లవల్లేరు: వేమవరం శ్రీ కొండలమ్మ తల్లి అమ్మవారి ఆలయంలో దసరా శరన్నవరాత్రి మహోత్సవాలను ఆలయ ఈఓ ఆకుల కొండలరావు, ధర్మకర్తల మండలి చైర్మన్ ఈడే వెంకట విష్ణు మోహనరావు ఆధ్వర్యంలో సోమవారం ప్రారంభించారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు కలశ స్థాపన కార్యక్రమం జరిగింది. పుణ్యాహవచన, పీఠార్చన, దీక్షాధారణ, సహస్ర నామార్చన, అగ్ని ప్రతిష్టాపన, శ్రీ లక్ష్మీ గణపతి సహిత నవగ్రహ హవనం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

పరిష్కార వేదికకు రెండు దరఖాస్తులు

గుడివాడ టౌన్ : స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు రెండు దరఖాస్తులు వచ్చినట్లు మున్సిపల్ కమిషనర్ ఎస్.మనోహర్ తెలిపారు. అనంతరం చాంబర్ ఆఫ్ కామర్స్ నాయకులు మున్సిపల్ కమిషనర్‌ను కలిసి వాణిజ్య పన్ను తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ పి. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహానికి స్థలం కేటాయించాలి

ముదినేపల్లి రూరల్: రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు ముదినేపల్లిలో స్థలం కేటాయించాలని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు సేవా నాగజగన్‌బాబురావు కోరారు. ఈ మేరకు ఏలూరులో జిల్లా కలెక్టర్‌కు సోమవారం వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు.

పౌష్టికాహారంతో వ్యాధులు దూరం

ముదినేపల్లి రూరల్: పౌష్టికాహారంతోనే మహిళల్లో వచ్చే వ్యాధులను నివారించవచ్చని గురజ పీహెచ్‌సీ వైద్యురాలు కె.రాణిశిరీషబాయి అన్నారు. స్వస్థ్ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గురజలో సోమవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ రమేష్, కిరణ్, ఊపిరితిత్తుల వ్యాధులు, మలేరియా గురించి వివరించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది ఎస్.ముత్తయ్య, కె జోనాతాన్, ఎస్ శాంతకుమారి పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

ముదినేపల్లి రూరల్: బొమ్మినంపాడులో నిర్వహిస్తున్న కోడి పందేలపై దాడి చేసి ఆరుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ వీరభద్రరావు తెలిపారు. జూదరుల నుంచి రూ.3,050తో పాటు రెండు కోడిపుంజులు, కత్తులు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

ప్రజారోగ్యమే ధ్యేయం



గుడ్లవల్లేరు: ప్రజారోగ్యమే ధ్యేయంగా ఎస్ఎన్ఎస్‌డీఈ కేంద్ర ప్రభుత్వ కారక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు కొతవరం పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ శ్రావ్య, డాక్టర్ మాధవి తెలిపారు. సోమవారం కృష్ణా మిల్క్ యూనియన్ డైరెక్టర్ వల్లభనేని బాబూరావు, సాగునీటి డీసీ చైర్మన్ మల్లిపెద్ది సుబ్రహ్మణ్యం చేతుల మీదుగా ఎస్ఎన్ఎస్‌డీఈ కేంద్ర ప్రభుత్వ కార్యక్రమ శిబిరాన్ని ప్రారంభించారు. ఇందులో భాగంగా మహిళలకు రక్తపోటు, మధుమేహం తదితర వైద్య పరీక్షలను చేపట్టారు.

భక్తులకు ఉచిత వైద్యం

గుడ్లవల్లేరు: వేమవరం శ్రీ కొండలమ్మ అమ్మవారి సన్నిధిలో దసరా నవరాత్రులకు వచ్చే భక్తులకు ఉచిత వైద్యాన్ని అందజేస్తున్నారు. ఈ వైద్య శిబిరాన్ని ఆలయ ఈఓ ఆకుల కొండలరావు, ధర్మకర్తల మండలి చైర్మన్ ఈడే వెంకట విష్ణు మోహనరావు చేతుల మీదుగా సోమవారం ప్రారంభించారు.

నేటి నుంచి ఆధార్ శిబిరాలు

కంకిపాడు: మండలంలోని పలు గ్రామాల్లో ఈనెల 23వ తేదీ నుంచి ఆధార్ నమోదు ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎస్.బసవయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 23, 24 తేదీల్లో ఉప్పలూరు, గొడవర్రు సచివాలయాలు, 25, 26 తేదీల్లో ప్రొద్దుటూరు, పునాదిపాడు-1 సచివాలయాల్లో శిబిరాలు నిర్వహిస్తారన్నారు. ఆయా గ్రామాల ప్రజలు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



గురజ రామలింగేశ్వరస్వామి ఆలయంలో బాలాత్రిపురసుందరీదేవీగా అమ్మవారు



ఆటపాకలో బాలా త్రిపుర సుందరీమాతగా కనకదుర్గమ్మ



వేమవరంలో బాలా త్రిపుర సుందరీ దేవిగా కొండలమ్మ



దోకిపర్రులో ఆదిలక్ష్మీగా అమ్మవారు

బాలా త్రిపుర సుందరీదేవి నమోస్తుతే..

గుడివాడ టౌన్ : దసరా నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకుని సోమవారం పలు ఆలయాలలో అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి భక్తుల దర్శనానికి ఉంచారు. స్థానిక బంటుమిల్లి రోడ్డులోని భీమేశ్వరస్వామి ఆలయంలో, గౌరీశంకర స్వామి దేవస్థానంలో, నీలామహల్ రోడ్డులోని విజయదుర్గ అమ్మవారి దేవస్థానంలో, ప్రణవాశ్రమంలో అమ్మవారిని శ్రీ బాలా త్రిపుర సుందరీ దేవిగా, జగన్నాథపురంలోని వేంకటేశ్వరస్వామి, శ్రీ వేణుగోపాలస్వామి దేవస్థానంలో శ్రీ ఆదిలక్ష్మిదేవిగా అలంకరించి భక్తుల దర్శనానికి ఉంచారు.

ముదినేపల్లిలో..

ముదినేపల్లి రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో దసరా ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు ఆలయాల్లో అమ్మవారు బాలాత్రిపురసందరీదేవీగా భక్తులకు దర్శనమిచ్చారు. చిగురుకోట ఆలయం వద్ద ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముదిరాజ్ విభాగం అధ్యక్షుడు కోమటి విష్ణువర్ధన్ ఆధ్వర్యంలో అమ్మవారికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బత్తిన కిషోర్, స్థానిక నాయకులు పాల్గొన్నారు. చినకామనపూడి మహంకాళేశ్వర స్వామి, పెదకామనపూడి రామలింగేశ్వరస్వామి, వడాలి ఆంజనేయస్వామి, అల్లూరు, పెయ్యేరు కనకదుర్గమ్మ ఆలయాలు గురజ రామలింగేశ్వర స్వామి, ఊటుకూరు శివారు నారాయణపురం అంకమ్మ ఆలయాల్లో అమ్మవారు బాలాత్రిపురసందరీ దేవీగా భక్తులకు దర్శనమిచ్చారు.

మండవల్లిలో..

మండవల్లి: మండవల్లి, కానుకొల్లు, లింగాల, పెరికెగూడెం, భైరవపట్నం, లోకుమూడి గ్రామాల్లో అర్చకులు ఉత్సవాల సందర్భంగా అమ్మవారిని సోమవారం సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఆయా ఆలయాలను విద్యుత్ దీపాలతో తీర్చిదిద్దారు. స్థానిక శ్రీ భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారిని శ్రీ బాలాత్రిపుర సుందరీదేవిగా అలకరించారు. ఎండోమెంట్స్ ఈఓ దివ్యశ్రీ పాల్గొన్నారు.

పెద్దింట్లమ్మ దేవస్థానంలో..

కైకలూరు: దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు కొల్లేటికోట పెద్దింట్లమ్మ దేవస్థానంలో సోమవారం ప్రారంభమయ్యాయి. అక్టోబరు 2వ తేదీ వరకు రోజూ అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అమ్మవారికి మొదటి రోజు శ్రీ చక్రార్చనా, లలిత సహస్రనామ కుంకుమ పూజలు జరిగాయి. ఉభయదాతలుగా భుజబలపట్నం గ్రామానికి చెందిన ముదునూరి రామలింగరాజు, రామసీత దంపతులు పూజలు చేశారు. ఈఓ కూచిపుడి శ్రీనివాసు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

పెదపారుపూడిలో..

పెదపారుపూడి: మండలంలోని అమ్మవారి ఆలయాల్లో దేవి శరన్నవరాత్రులు సోమవారం ప్రారంభమయ్యాయి. మండలంలోని వానపాముల గ్రామంలో రామలింగేశ్వరస్వామి ఆలయంలోని పార్వతి అమ్మవారు భక్తులకు బాలా త్రిపురసుందరి దేవిగా దర్శనం ఇచ్చారు. మండలంలోని వెంట్రప్రగడలోని లక్ష్మీ నరసంహస్వామి ఆలయం వద్ద కనకదుర్గమ్మ తల్లి ఉత్సవ విగ్రహం ఏర్పాటు చేశారు. విగ్రహదాత కూరకుల రాఘవులు, మల్లేశ్వరీ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గుడ్లవల్లేరులో..

గుడ్లవల్లేరు: దసరా నవరాత్రుల్లో భాగంగా సోమవారం వేమవరం శ్రీ కొండలమ్మ తల్లితో పాటు అంగలూరు శ్రీ జ్ఞానసాయి మందిరంలో అమ్మవారు శ్రీ బాలా త్రిపురసుందరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. దోకిపర్రు భూ సమేత శ్రీ వెంకటేశ్వరుని ఆలయంలో అమ్మవారు ఆదిలక్ష్మీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

కొండలమ్మను దర్శించుకున్న ప్రముఖులు

గుడ్లవల్లేరు: వేమవరం శ్రీ కొండలమ్మ అమ్మవారిని సోమవారం రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, చేకూరి జగన్మోహనరావు, సీఐ ఎస్.సోమేశ్వరరావు, ఎస్ఐ ఎస్.వి.వి.సత్యనారాయణ దర్శించుకున్నారు. వీరికి ఆలయ ఈఓ ఆకుల కొండలరావు, ధర్మకర్తల మండలి చైర్మన్ ఈడే వెంకట విష్ణు మోహనరావు సన్మానించి అమ్మవారి చిత్రపటాలతో పాటు లడ్డూ ప్రసాదాలను అందించారు.

కూచిపూడిలో..

కూచిపూడి(మొవ్వ): దసరా వేడుకలలో భాగంగా తొలిరోజు సోమవారం శ్రీ బాలాత్రిపుర సుందరి అమ్మవారు స్వర్ణకవచాలంకృత శ్రీ బాల త్రిపుర సుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి అర్చనలు శ్రీ చక్ర అర్చన పూజలు కార్తికేయ శర్మ చేశారు. అమ్మవారికి విశేషాలంకారాలను అర్చకులు పూర్ణ చంద్రశేఖరశర్మ, సతీష్‌కుమార్‌శర్మ, సుబ్రహ్మణ్యశాస్త్రి, రాకేష్ శర్మ నిర్వహించారు.



పామర్రు అంకమ్మతల్లి ఆలయంలో సామూహిక కుంకుమ పూజ

శ్యామలాంబకు పట్టువస్త్రాలు సమర్పణ

కైకలూరు: కైకలూరు శ్యామలాంబ ఆలయంలో దసరా ఉత్సవాల్లో మొదటి రోజు సోమవారం బాలా త్రిపుర సుందరీదేవిగా శ్యామలాంబ భక్తులకు దర్శనమిచ్చారు. ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ విచ్చేసి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయ ఈఓ వీఎన్‌కే.శేఖర్ ఆధ్వర్యంలో వేద ఆశీర్వాదం చేశారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు, ఎంపీపీ అడవి కృష్ణ, తాత్కలిక సర్పంచ్ కేవీఎస్ఎం.నాయుడు, నాయకులు పూలా రాజీ, నర్సిపల్లి అప్పారావు, బీకేఎం,నానీ, చలపతి పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా కోలాట, సంగీత, కూచిపూడి ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

వివిధ ఆలయాల్లో..

లోకుమూడి గురువు దత్తాశ్రమంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు బాలా త్రిపుర సుందరీ దేవీ అలంకరణలో దర్శనమిచ్చారు. గురజాడ ఉదయశంకర్ దంపతులు పూజలు చేశారు. కైకలూరు వాసవీ కన్యక పరమేశ్వరీ అమ్మవారి వార్షిక శరన్నవరాత్రులలో అమ్మవారు కన్యాకుమారి అవతారంలో దర్శనమిచ్చారు. షిరిడీ సాయి మందిరంలో దశావతారాల్లో భాగంగా బాబా మత్స్యావతారం ఆకట్టుకుంది.



కైకలూరు శ్యామలాంబకు పట్టువస్త్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కామినేని

దేవీ శరన్నవరాత్రులు ప్రారంభం

పామర్రు: మండలంలోని అన్ని ఆలయాల్లో సోమవారం దేవీశరన్నవరాత్రులు ఘనంగా ప్రారంభించారు. స్థానిక విజయవాడ రోడ్డులోని శ్రీ అంకమ్మతల్లి ఆలయంలో అమ్మవారిని బాలా త్రిపుర సుందరీదేవిగా అలంకరించారు. ఆలయ ప్రాంగణంలో భక్తులతో సామూహిక కుంకుమపూజ కార్యక్రమం చేశారు. కన్యకా పరమేశ్వరీ ఆలయంలో సోమేశ్వరస్వామి ఆలయంలోని అమ్మవార్లను బాలా త్రిపుర సుందరీదేవిగా అలంకరించి పూజలు చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షులు బొగ్గరపు జాలయ్య, సభ్యులు బి సాయిబాబు, మణికంఠ, మానేపల్లి రఘురాం, సత్యసాయి పాల్గొన్నారు.



కొల్లేటికోట పెద్దింట్లమ్మకు పూజలు చేస్తున్న ఉభయదాతలు



స్వర్ణకవచాలంకృత బాలాత్రిపుర సుందరీ దేవిగా బాలమ్మ

సరస్వతీ దేవికి మకర తోరణం బహూకరణ



జమీదగ్గుమిల్లి(పామర్రు): గ్రామంలోని జెడ్పీ హైస్కూల్ ఆవరణలో నిర్మించిన సరస్వతీ దేవికి స్థానికులు సుంకర శాంతకుమారి, తన్నీరు వెంకటరమణ, లక్ష్మీరాజీ దంపతుల సౌజన్యంతో సరస్వతీ దేవికి సోమవారం ఇత్తడి మకర తోరణాన్ని అందజేశారు. ఆలయంలో పూజలను ఆర్ ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు శీతాల ధనలక్ష్మీ, ఆర్.చారుమతి, వెంకటేశ్వరమ్మ, లక్ష్మీ పాల్గొన్నారు.

కావూరి శ్రీధర్‌కు వావిలాల పురస్కారం

గుడివాడ టౌన్ : తెలుగు భాషా వికాస సమితి ఆధ్వర్యంలో తెలుగు ఉపాధ్యాయుడు కావూరి శ్రీధర్‌కు వావిలాల గోపాల కృష్ణయ్య సాహితీ పురస్కారం 2025 సోమవారం అందజేశారు. స్థానిక ఆంజనేయ పేటలోని సీపీఎం కార్యాలయంలో ఆయనకు ఈ పురస్కారం అందజేశారు. వావిలాల గోపాలకృష్ణయ్య శాసన సభ్యుడిగా ప్రజా సమస్యల పరిష్కారానికి అలుపెరుగని పోరాటం చేసిన నిజమైన ప్రజానేత అని వక్తలు పేర్కొన్నారు. ఆయన పేరిట రూపొందించిన పురస్కారాన్ని కావూరి శ్రీధర్‌కు అందజేయడం అభినందనీయమన్నారు. డెప్యూటీ ఎంపీడీఓ వంగా శ్రీనివాస్, తెలుగు భాష వికాస సమితి సమన్వయకర్త డీఆర్‌బీ ప్రసాదు, సభ్యులు పాల్గొన్నారు.

సమాధుల స్థలం ఏర్పాటు చేయాలి



గుడివాడ టౌన్ : దళిత క్రైస్తవులకు పట్టణంలో సమాధుల స్థలం ఏర్పాటు చేయాలని దళిత నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా దళిత నాయకులు మాట్లాడుతూ శ్మశాన వాటిక ఏర్పాటు కోసం దళితులు పోరాడుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదన్నారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఈ ధర్నాలో దళిత నాయకులు కంచర్ల సుధాకర్, పాస్టర్లు జడా జానన్న, వై. యెషయ్య, నాయకులు కె. గంగాధరరావు, వి. సుజాత, టి. ప్రశాంత్, ఎం.ఎలీషా, మాణిక్యాలరావు, సుందరయ్య, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పంట కాలువలో చెత్త తొలగింపు

మండవల్లి: లింగాల పోలరాజ్ పంట కాలువ నుంచి మొఖాసాకలవపూడి వచ్చే పంట కాలువలో పేరుకుపోయిన గడ్డి, చెత్తను సోమవారం తొలగించారు. గడ్డి, చెత్త పేరుకుపోవడంతో కాలువలో నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడి రైతులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో గన్నవరం నీటిసంఘం అధ్యక్షుడు కూనపురెడ్డి వెంకట బాల కోటేశ్వరరావు ఆధ్వర్యంలో కూలీలను పెట్టి కాలువలో పేరుకుపోయిన చెత్తను తొలగించారు.

సామాజిక పురోగతిలో యువత పాత్ర కీలకం

కైకలూరు: దేశ సమ్మిళిత అభివృద్ధి, ఆర్థిక శ్రేయస్సు, సామాజిక పురోగతి, సుపరిపాలనలో యువత పాత్ర కీలకమని కృష్ణా యూనివర్సిటీ ఉప కులపతి ప్రొఫెసర్ డాక్టర్ కూన రాంజీ పేర్కొన్నారు. స్థానిక వైఎస్సార్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో సేవా పర్వ్, వికసిత్ భారత్- 2047పై ఒక రోజు వర్చువల్ వర్క్‌షాప్ సోమవారం జరిగింది. కాలేజీ చరిత్ర, సాంస్కృతిక క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి చరిత్ర విభాగాధిపతి డాక్టర్ ఎం.హరిప్రసాద్ సంధానకర్తగా వ్యవహరించారు. ఎన్ఎస్ఎస్ రాష్ట్ర అధికారి డాక్టర్ మద్దినేని సుధాకర్, దూరదర్శన్ విశ్రాంత డెప్యూటీ డైరెక్టర్ డాక్టర్ జి.కొండలరావు వర్చువల్‌గా వివిధ అంశాలపై ప్రసంగించారు. అనంతరం కాలేజీ విద్యార్థులకు వికసిత్ భారత్‌పై చిత్రలేఖనం, కథాకథనం పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అడపా కేదారి, అధ్యాపకులు జాలబాబు, శ్రీనివాసరావు, వేదాంతం, వీరరాజు, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.



డిగ్రీ కాలేజీలో వర్చువల్ విధానంలో మాట్లాడుతున్న ఉపకులపతి రాంజీ

అవశేష రహిత పంట ఉత్పత్తులు సాధించండి

పమిడిముక్కల: పంటల సాగులో రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి, అవశేష రహిత ఎరువుల వాడకం పెంచాలని కేవీకే సమన్వయకర్త డాక్టర్ సుధారాణి పేర్కొన్నారు. ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని కృషి విజ్ఞాన కేంద్రం ఘంటశాల వారు వీరంకిలాకు రైతు సేవా కేంద్రంలో ఇఫ్‌కో కంపెనీ సహకారంతో ఖరీఫ్ పంటల సాగులో మేలైన యాజమాన్య పద్ధతులపై అవగాహన, చర్చా కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం రైతులతో కలిసి వరిపొలాలను సందర్శించారు. ఆకుముడత తెగులు నివారణకు ఎసిఫేట్ 300 గ్రాములు ఎకరానికి, పొడతెగులు నివారణకు హెక్సాకొనజోలు 400 మిలీలీటర్లు ఎకరానికి పిచికారీ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు వెంకటలక్ష్మి, రేవతి, ఇఫ్‌కో మేనేజర్ నందకిషోర్, ఏఓ గణేష్‌రెడ్డి పాల్గొన్నారు.



వరిపొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

శ్యామలా నవదిన దీక్ష ప్రారంభం



కైకలూరు: దసరా ఉత్సవాల సందర్భంగా ప్రతి ఏటా స్థానిక శ్యామలాంబ అమ్మవారి దేవస్థానంలో అమ్మవారి దీక్షా మాల ధరించడం ఆనవాయితీ. ఈ ఏడాది 21 మంది అమ్మవారి మాలధారణ సోమవారం స్వీకరించారు. అందరూ నవదిన దీక్షను తీసుకున్నారు.

చిన్నారులను క్రమశిక్షణతో పెంచాలి



కనుమూరు(పామర్రు): చిన్నారులను క్రమశిక్షణతో పెంచాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్.విజయకుమారి పేర్కొన్నారు. గ్రామంలోని కనుమూరు-1 కేంద్రంలో రాష్ట్రీయ పోషణ మాసం-2025 కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బాల్యం నుంచి చిన్నారులను సంరక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

సమతుల్య ఆహార నియమాలు పాటించండి



కైకలూరు: ప్రజలు తీసుకునే ఆహారంతోనే ఆరోగ్యం ముడిపడి ఉందని ఐసీడీఎస్ సీడీపీఓ డాక్టర్ ఎస్. దీప్తి తెలిపారు. ఆటపాక పంచాయతీ కార్యాలయంలో పోషణ్ మహ్, స్వస్థనారీ.. సశక్తి పరివార అభియాన్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఉచిత మెడికల్ క్యాంపులో మహిళలను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో సీడీపీఓ మాట్లాడారు. ఆరోగ్య శిబిరాలు 15 రోజులు జరుగుతాయన్నారు. సరైన పోషకాహారం తీసుకోవడంతో రక్తహీనత నుంచి రక్షణ పొందవచ్చన్నారు. నిత్యావసర సరుకులైన ఉప్పు, ఆయిల్, మైదాపిండి, పంచదార, తెల్ల బియ్యం ఎక్కువగా వాడకూడదన్నారు. కొల్లేటికోట పీహెచ్‌సీ డాక్టర్ హేమచంద్ మాట్లాడుతూ వైద్య శిబిరాల్లో స్త్రీలు స్క్రీనింగ్ టెస్టులు తప్పక చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ టీవీఎల్‌బీ.ప్రసన్నకుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్యామలాగౌరి, హెల్త్ సూపర్‌వైజర్ నాగమణి, సీహెచ్‌ఓ పైడమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యమే లక్ష్యం



శిబిరంలో వైద్యసేవలు అందిస్తున్న వైద్యులు

పసుమర్రు(పామర్రు): గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉచిత వైద్యం అందించడమే లక్ష్యంగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ కాకి నాగేంద్రం పేర్కొన్నారు. మండలంలోని పసుమర్రులో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. నిమ్మకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు జ్యోతి , సిబ్బంది వైద్యసేవలు అందించారు.

పాలిటెక్నిక్ విద్యార్థులకు బహుమతుల పంట

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు ఎ.ఎ.ఎన్.ఎం అండ్ వి.వి.ఆర్.ఎస్.ఆర్. పాలిటెక్నిక్ శేషాద్రి రావు నాలెడ్జ్ విలేజ్ విద్యార్థులు బహుమతుల పంట పండించారు. ఈ విషయాన్ని ఆ కాలేజీ ప్రిన్సిపాల్ ఎస్. రాజశేఖర్ సోమవారం విలేకరులకు తెలిపారు. విజయవాడ ఆంధ్ర లయోల కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ వారు ఈ నెల 20వ తేదీన జాతీయ స్థాయి టెక్నికల్ ఫెస్ట్-2025ను నిర్వహించారని పేర్కొన్నారు. ఇంజినీరింగ్, డిప్లొమా విద్యార్థులకు కలిపి నిర్వహించారని తెలిపారు. తమ పాలిటెక్నిక్ విద్యార్థులు ఫెస్ట్‌లో ప్రదర్శించిన ప్రతి అంశంలో పాల్గొని ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను సాధించారన్నారు. బహుమతులు సాధించిన విద్యార్థులను, వారికీ ప్రత్యేక శిక్షణను అందించిన ఇ.సి.ఇ, మెకానికల్, కంప్యూటర్, సి.ఐ.ఓ.టి బ్రాంచ్ విభాగాధిపతులను అభినందించారు.



విజేతలతో ప్రిన్సిపాల్ రాజశేఖర్

ఏఎన్నార్ విద్యార్థుల పారిశ్రామిక సందర్శన

గుడివాడ టౌన్ : విద్యతో పాటు ప్రయోగాత్మక అవగాహన కూడా విద్యార్థులకు అవసరమని ఏఎన్నార్ కళాశాల ప్రిన్సిపాల్ పీజేఎస్ కుమార్ అన్నారు. సోమవారం కళాశాల ఎంబీఏ విద్యార్థులు తమిరిశ గ్రామంలో ఉమా స్పిన్‌టెక్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కర్మాగారాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమల నిర్వాహణలో ప్రత్యక్ష పరిజ్ఞానం సంపాదించడం వలన విద్యార్థులు వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోగలుగుతారన్నారు. ఉమా స్పిన్‌టెక్స్ డైరెక్టర్లు నందమూరి కృష్ణప్రసాద్, మేనేజర్ నందమూరి అక్షయ్ తమ కర్మాగారం ఉత్పత్తులు అమ్మకం, రా మెటీరియల్ సేకరణ, ఫ్యాక్టరీ నిర్వహణకు సంబంధించిన సమాచారాన్ని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఎంబీఏ హెచ్‌ఓడీ ఎంబీ సువర్చల, అధ్యాపకులు వి. నాగేంద్ర కుమార్, ఎం. భరత్ కుమార్ పాల్గొన్నారు.



ఫ్యాక్టరీని సందర్శించిన ఏఎన్నార్ కళాశాల విద్యార్థులు

● సీబీఎస్ఈ సిలబస్ రద్దు చేయడం తగదు

గన్నవరం: ప్రభుత్వ పాఠశాలలో సీబీఎస్ఈ సిలబస్‌ను రద్దు చేయడం అంటే దళిత, గిరిజన, వెనుబడిన వర్గాల పిల్లలకు ఉన్నత విద్యను దూరం చేయడమేనని గన్నవరం జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలజబెత్‌రాణి సోమవారం ఒక తెలిపారు. పేదల తలరాతను మార్చే సీబీఎస్ఈ సిలబస్‌ను కూటమి ప్రభుత్వం రద్దు చేయడం దుర్మార్గమన్నారు.